

ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు...

ప్రజాశక్తి- తాళ్లపూడి

ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచి ప్రణాళిక ప్రకారం ఇష్టపడి చదువు కొనసాగిస్తే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని మండల విద్యాశాఖ అధికారి సిహెచ్.బాలామణి అన్నారు. వేగేశ్వరపురం కెజిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2023వ సంవత్సరం విద్యా సంవత్సరానికి చెందిన పూర్వపు విద్యార్థి సిద్ధ మాధురి ఐఐటి ధన్ బాద్‌లో సీటు పొందింది. పూర్వపు విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఆమెకు సోమవారం రూ.20 వేల నగదు పురస్కారం అందించారు. ఈ సందర్భంగా ఎంఇఒతో పాటు పలువురు వక్తలు మాట్లాడారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల అవసరాలు తీర్చడానికి పూర్వపు విద్యార్థులు చూపిస్తున్న చొరవను మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థుల సంఘం సభ్యులు శీర్ల బ్రహ్మానందం, వి.సూర్యనారాయణ, ఎ.డేవిడ్‌రాజు, ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

మొక్క చాటు... గంజాయి రూటు

- నర్సరీ లారీల్లో పట్టుబడుతున్న గంజాయి మూటలు
- మొక్కల మాటున ఇతర రాష్ట్రాలకు తరలింపు

ప్రజాశక్తి-కడియం

గత కొన్నేళ్లుగా సమాజాన్ని విచ్ఛిన్నం చేస్తూ, యువత భవిష్యత్ ను నాశనం చేస్తూ, పలువురిని పెడదారి పట్టిస్తున్న మహమ్మారి గంజాయి. ఈ మత్తు మహమ్మారి రాను రాను కొత్త పుంతలు తొక్కుతోంది. పోలీసుల కన్నుగప్పి, గంజాయిని అనుకున్న చోటకు చేర్చడానికి మాఫియా ఎత్తుకు పైఎత్తులు వేస్తోంది. చివరికి నర్సరీ రంగాన్ని కూడా అది వదల్లేదు. దేశంలో వివిధ రాష్ట్రాలకు ఇక్కడ నుంచి మొక్కలు ఎగుమతి అవతున్నాయి. దీంతో గంజాయి రవాణాకు సులభ మార్గంగా మాఫియా దీన్ని ఎంచుకున్నట్టు కనిపిస్తోంది.

ఇటీవల కాలంలో గంజాయి రవాణా కేసులు ఈ ప్రాంతం లో తరచూ బయటపడుతున్నాయి. తులసి వనంలో గంజాయి మొక్క అన్న చందంగా ఇక్కడి పచ్చని మొక్కల మాటున గంజాయిని ఎగుమతి చేస్తూ కొందరు అక్రమార్కులు వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాయి. లక్షలాది యువత జీవితాలతో పాటు, నర్సరీ వ్యవస్థను సైతం కొందరు పాడు చేస్తున్నారని స్థానిక పెద్దలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద పెద్ద నగరాలు, పట్టణాలకే పరమితమైన గంజాయి ఇప్పుడు మారుమూల గ్రామాలకూ వ్యాపించింది. పట్టుబడ్డ గంజాయి కేసుల్లో పెద్దగా పురోగతి లేకుండానే మధ్యలో ఆగిపోవడంతో అసలు సూత్రధారులు ఎవరో తెలియకుండానే గంజాయి కేసులు కనుమరుగవుతున్న దాఖలాలూ లేకపోలేదు. కూలి కోసం గంజాయి రవాణాకు అంగీకరించిన కొంతమంది అమాయకులే ఈ కేసుల్లో బలవుతుండగా, రూ.కోట్లు దండుకుంటున్న అక్రమార్కులు మాత్రం బయటపడడం లేదు. పోలీసులు ఎన్ని హెచ్చరికలు జారీ చేస్తున్నా, ఎన్ని తనిఖీలు నిర్వహిస్తున్నా గంజాయి రవాణాకు మాత్రం అడ్డుకట్ట పడటం లేదు. తక్కువ సమయంలోనే ఎక్కువ సంపాదించాలన్న అత్యాసపరులైన కొందరు స్థానిక రైతుల ముసుగులో ఈ అక్రమ దందాకు సహకరిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.



ఇటీవల కడియం మండలంలో నర్సరీ మొక్కలు తరలిస్తున్న లారీలో పట్టుకున్న గంజాయి

సూత్రదారులను గుర్తించి అరెస్టు చేస్తున్నాం

గంజాయి కేసుల విచారణలో పురోగతి లేదనడం వాస్తవం కాదు. పట్టుబడ్డ కేసుల మూలాలు వెతకడంతోపాటుగా సూత్రదారులను గుర్తించి అరెస్టు చేస్తున్నారు. ఇలా అరెస్టు చేసిన సందర్భాలు ఉన్నాయి. కేసుల విషయంలో ఎటువంటి అపోహలకు, అనుమానాలకు ఆస్కారం లేదు. ఇటీవల పట్టుబడ్డ గంజాయి విక్రయాల యువకులు తెలిపిన సమాచారం మేరకు కేడీ పేటలో గంజాయి సమాకూర్చిన నిందితున్ని అదుపులోకి తీసుకున్నాం. కేసుల విచారణ, పురోగతిలో భాగంగా కచ్చితమైన ఆధారాలు సేకరించడంలో కొంత సమయం పట్టవచ్చు గాని, ఎలాంటి నిర్లక్ష్యం లేదు. ఉన్నతాధికారుల ఆదేశాలతో మాదకద్రవ్యాలు, అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు చేపడుతున్నాం. ఇలాంటి విషయాల్లో ఎవర్నీ ఉపేక్షించబోము.

- అల్లు వెంకటేశ్వరరావు, సిఐ, కడియం

"మొక్కల మాటున పట్టుబడ్డ గంజాయి"

నర్సరీ మొక్కల రవాణా పేరుతో భారీగా గంజాయి తరలించే వాహనాన్ని నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సిబి) అధికారులు ఇటీవల కడియపులంక జాతీయ రహదారి వద్ద పట్టుకున్నారు. గతంలోనూ ఈ ప్రాంతంలో మొక్కల మాటున గంజాయిని రవాణా చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. స్థానిక పోలీసులపై నమ్మకం లేక కొంతమంది ఈ ప్రాంతంలో గంజాయి తరలింపుపై ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్టు తెలిసింది. గతంలో కూడా కడియం పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయిని పట్టుకున్న కేసులున్నాయి. ఈ ప్రాంతంలో ఇటీవల కొంతమంది యువత గంజాయికి బానిసలయ్యారు. వలస కూలీలు, యువతను లక్ష్యంగా చేసుకుని సమీప ప్రాంతాల నుంచి కొందరు యువకులు వచ్చి కడియం ప్రాంతంలో గంజాయి విక్రయాలు చేస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇటీవల కొందరు బయట యువకులు గంజాయి అమ్ముతూ కడియపులంకలో పోలీసులకు పట్టుబడటం ఈ వార్తలకు బలాన్ని చేకూరుస్తున్నాయి. గంజాయి సేవిస్తున్నారనే సమాచారంతో కొందరు మైనర్లకు, వారి తల్లిదండ్రులకు ఇటీవల స్థానిక పోలీస్ స్టేషన్‌లో కౌన్సిలింగ్ సైతం ఇచ్చారు. స్థానిక నర్సరీ రైతాంగం తో పాటు, రాజకీయ నాయకులు, పెద్దలు, ప్రభుత్వ యంత్రాంగం కలిసికట్టుగా ముందడుగువేసి కడియం మండలాన్ని మాదక ద్రవ్యాల రహిత మండలంగా తీర్చి దిద్దేందుకు కృషి చేయాలని పలువురు కోరుతున్నారు. లేకుంటే కడియం నర్సరీ రైతాంగానికి, నర్సరీ వ్యవస్థకు భవిష్యత్తు ఉండదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే గంజాయి రవాణా అనుమానితుల పై, మొక్కలు ఎగుమతుల వాహనాలపై నర్సరీ అసోసియేషన్ ప్రతినిధులు ప్రత్యేక దష్టి పెట్టాలని, అవసరం అయితే అసోసియేషన్ తరపున కొన్నాళ్లు సొంత సిబ్బందిని నియమించి నిఘా ఏర్పాటు చేయాలని మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.



కడియపులంకలో పట్టుబడ్డ గంజాయి విక్రేతలు



కళ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న కార్మికులు

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

తమ సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సత్యసాయి మంచినీటి పథకం కార్మికులు హెచ్చరించారు. లాలాచెరువు ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద వారు చేపట్టిన సమ్మె సోమవారం నాటికి 14వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా కార్మికులు కళ్లకు గంతలు కట్టుకుని శిబిరంలో కూర్చొన్నారు. ఈ సమ్మెను ఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి బివిఎన్.పూర్ణిమరాజు మాట్లాడారు. 19 నెలలగా వేతనాలు లేక కార్మికులు ఆకలితో అలమటిస్తున్నారన్నారు. 25 నెలలగా ఇఎస్ఐ, పిఎఫ్ కట్టడం లేదని తెలిపారు. పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న కూటమి సర్కారుకు సత్యసాకి కార్మికుల ఆకలి కేకలు వినపించట్లేదా? అని ప్రశ్నించారు. సుపరిపాలన అంటూ తిరిగే నాయకులకు 14 రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికులు కనిపించకపోవడం దారుణమన్నారు. కార్మికులు సమ్మె బాట పట్టడంతో మూడు నియోజవర్గాలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఐదు మండలాల్లో సుమారు 85 గ్రామాలకు గోదావరి మంచినీరు నిలిచిపోయిందన్నారు. ఇప్పటికైనా పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ స్పందించాలన్నారు. వెంటనే సత్యసాయి కార్మికులకు వేతనాలు ఇవ్వాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.శ్రీను, ఇస్సాక్, కోశాధికారి కె.రామకృష్ణ, కార్మికులు సుబ్బారావు, రామకృష్ణ, శేషారావు, వీరబాబు, మల్లేశ్వరరావు, రాధాకృష్ణ, మల్లిరెడ్డి, అర్జున్, సత్యనారాయణ, సురేష్, కష్ణారెడ్డి, దొర బాబు, రాజు, శ్రీను, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఫేస్ యాప్ రద్దు చేయాలని అంగన్‌వాడీల ధర్నా

ప్రజాశక్తి - పెరవలి

ఫేస్ యాప్‌ను రద్దు చేయాలంటూ ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రాజెక్ట్ గౌరవాధ్యక్షులు జువ్వల రాంబాబు మాట్లాడారు. పాత పద్ధతిలోనే లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేయాలన్నారు. సెంటర్ నిర్వాహణకు ఒక యాప్ మాత్రమే నిర్వహించాలని డిమాండ్ చేశారు లబ్ధిదారులకు ఆహారం అందించడం కోసం లేని పోని నిబంధనలు పెట్టడం ఐసిడిఎస్ స్ఫూర్తిని దెబ్బతీయడమేనన్నారు. వెంటనే పేస్ యాప్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు అనంతరం సిడిపిఒ ఎన్.ఆశా రోహిణికి వినత పత్రాన్ని అందజేశారు ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ నాయకులు కె.కృష్ణవేణి, కె.లక్ష్మీకుమారి, బి.మేరీవిక్టోరియారాణి, పి.పార్వతి, యు.ధనలక్ష్మి, కె.లక్ష్మి బంగారమ్మ, కె.రామలక్ష్మి, పి.గిరిజ, పి.పద్మ, కె.పద్మ తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న అంగన్‌వాడీలు

180 మందికి నేత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ఉంద్రాజవరం

ఉంద్రాజవరం బౌద్ధ ధమ్మ పీఠం ఆధ్వర్యంలో, మైత్రేయ బుద్ధ విహార్ ప్రాంగణంలో సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 180 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని పీఠాధిపతి భంతే అనాలయో తెలిపారు. వేమగిరిలోని పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల సహకారంతో ప్రతి నెలా మూడవ సోమవారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. దీనిలో భాగంగా 21 మందికి శస్త్ర చికిత్సలు అవసరం అయ్యాయన్నారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశామని, పలువురికి కళ్లద్దాలు అందించామన్నారు. శస్త్ర చికిత్సలు అవసరమైన రోగులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసి, ఆసుపత్రికి తీసుకువెళ్లి, ఆపరేషన్ అనంతరం వారి ఇళ్ల వద్ద దించుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రెండు రోజులు విద్యుత్‌కు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి సెక్షన్ పరిధిలో 33/11 కెవి రామన్న పాలెం సబ్‌స్టేషన్‌లో 11కెవి రామన్నపాలెం రూరల్ ఫీడర్‌పై ఆర్‌డిసిఎస్ పనుల నిమిత్తం మంగళ, బుధవారాల్లో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ అధికారి ఎన్.నారాయణ అప్పారావు తెలిపారు. ఆయా రోజుల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు ఉండదన్నారు. ధుమంతనగూడెం, కొత్తగూడెం, సుబ్బరాయపురం గ్రామాల్లో విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఇక తాడో పేడో తేల్చుకుంటాం...

పేపర్ మిల్లు కార్మికుల సమస్యలపై నిరవధిక దీక్ష

రాజానగరం మాజీ ఎంఎల్ఎ జక్కంపూడి రాజా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఎపి పేపర్ మిల్లులో పనిచేస్తున్న కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చడంలో మిల్లు యాజమాన్యం నిరంకుశంగా వ్యవహరిస్తుందని రాజానగరం మాజీ ఎంఎల్ఎ జక్కంపూడి రాజా అన్నారు. సోమవారం రాత్రి పేపర్ మిల్లు ఎదురుగా గల శ్రీకష్ణ సాయి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజా మాట్లాడారు. కార్మికుల సమస్యను కూటమి ప్రభుత్వంలోని ప్రజా ప్రతినిధులు పరిష్కరిస్తారని వేచి చూశామని, కాని సమస్య పరిష్కారంలో తీవ్ర జాప్యం నేపథ్యంలో పేపర్ మిల్లు యాజమాన్యంతో ఇక తాడోపేడో తేల్చుకోవడానికి సిద్ధమవుతున్నామన్నారు. ఇందులో భాగంగా పేపర్ మిల్లు మెయిన్ గేట్ ఎదురుగా గల వైఎస్ఆర్ విగ్రహం వద్ద నిరవధిక దీక్ష చేపడతాననిరాజా ప్రకటించారు. పేపర్ మిల్లు కార్మికులకు న్యాయపరంగా మూడేళ్ళ క్రితమే వేతన ఒప్పందం జరగాల్సి ఉందన్నారు. వేతన ఒప్పందంతోపాటు కార్మికులకు న్యాయ పరంగా అందించాల్సిన సౌకర్యాలను కల్పించడంలోనూ యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తుందన్నారు. పేపర్ మిల్లులో కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని అనేక రూపాలలో ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. అయినప్పటికీ సమస్య పరిష్కరించే విషయంలో యాజమాన్యం నియంతత్వంగా వ్యవహరిస్తుందన్నారు.

కొత్త ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయిందని, స్థానిక ప్రజాప్రతినిధులు సమస్య పరిష్కారానికి హామీలు ఇచ్చినప్పటికీ పేపర్ మిల్లు యాజమాన్యంతో జరుగుతున్న చర్చలు సఫలం కావడం లేదన్నారు. ఇటీవల అధికార పార్టీకి చెందిన కార్మిక యూనియన్ నాయకులు తనపై విమర్శ చేయడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. గతంలో పేపర్ మిల్లులో ప్రభుత్వానికి 27శాతం వాటా ఉండేదని గుర్తు చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత ఈ వాటాను విక్రయించారన్నారు. ప్రభుత్వానికి షేర్లు ఉండేటప్పుడు పేపర్ మిల్లుపై నియంత్రణ ఉండేదని, కార్మికులకు ఏ సమస్య వచ్చినా ప్రభుత్వం పరిష్కరించేదని తెలిపారు.

ప్రభుత్వ వాటా వదులుకున్న తర్వాత మిల్లు యాజమాన్యం ఇష్టానుసారంగా వ్యవహరిస్తుందన్నారు. పేపర్ మిల్లు కార్మికులకు యాజమాన్యం ఇంత అన్యాయం చేస్తుందంటే గుర్తింపు యూనియన్‌గా ఉన్నారో ఒకసారి గుర్తు చేసుకోవాలని అన్నారు. కార్మికులకు వేతన ఒప్పందం చేసే విషయంలో ఇప్పుడు జరిగినంత జాప్యం గత 30 ఏళ్ళలో ఎన్నడు జరగలేదన్నారు. తాను చేస్తున్న ఉద్యమానికి పార్టీలోని ముఖ్య నాయకులు శ్రీఘాకోళ్ళపు శివరామ సుబ్రహ్మణ్యం,డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్య ప్రకాశరావు,నందెపు శ్రీనివాస్ ఇతర ముఖ్య నాయకులు అంతా మద్దతుగా నిలుస్తున్నారని వెల్లడించారు.అవసరమైతే పేపర్ మిల్లు సమస్యను రాష్ట్రస్థాయికి తీసుకువెళ్తామన్నారు ఈ నెల 9 నుంచే ఆమరణ దీక్ష చేస్తామని ప్రకటించామని కూటమి నాయకులు చర్చలు జరుపుతున్నాం సమస్య పరిష్కారమవుతుందని చెప్పడంతో వేచిచూశానని తెలిపారు. ఈ సమావేశంలో శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ లు బొంత శ్రీహరి,మానె దొరబాబు, ఇసుకపల్లి శ్రీనివాస్, మాసా రామ్‌జోగ్, బురిడి త్రిమూర్తులు, అడపా అనిల్, నాళం రోశయ్య తదితరులు పాల్గొన్నారు..

భూమి లేకుండానే అమ్మకం

రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగికి రూ.14 లక్షల టోకరా

ప్రజాశక్తి - గోపాలపురం

భూమి లేకుండానే ఆన్‌లైన్‌లో అమ్మకం చేసినట్టు చూపి రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగికి రూ.14 లక్షలకు టోకరా వేసిన ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తప్పుడు సర్వే నెంబర్‌తో మోసం చేశారని గ్రహించిన ఆయన కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.భాస్కర్‌రెడ్డి భీమోలు గ్రామంలో విచారణ చేపట్టారు. రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి దాసరి నరసింహారెడ్డి జిల్లా సైనిక్ వెల్ఫేర్ బోర్డుకు ప్రభుత్వం భూమి కోసం దరఖాస్తు చేసుకున్నారు. 2022లో ప్రభుత్వ భూమి కోసం అప్పటి గోపాలపురం డిప్యూటీ తహశీల్దార్ కృష్ణను, రాజకీయ నాయకుడు గోపాలపురానికి చెందిన జి.శ్రీను, భీమోలు గ్రామానికి చెందిన కె.శ్రీనును ఆయన సంప్రదించారు. వీరు ముగ్గురు కలిసి మండలంలోని భీమోలు గ్రామంలో వివాదంలో ఉన్న భూమిని ఆయనకు చూపించారు. 558/1ఎలో నాలుగు ఎకరాల భూమిను రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి పేరున ఆన్‌లైన్ చేశారు. దీని కోసం వారు రూ.14 లక్షలను వారు వసూలు చేశారు. అనంతరం భూమికి సంబంధించిన వివరాలు ఆన్‌లైన్‌లో లేకపోవడంతో మోసపోయానని గ్రహించాడు. దీనిపై డిటి కృష్ణను నిలదీయగా రూ.4,85లక్షలు వెనక్కి ఇచ్చారు. ఎంత అడిగినప్పటికీ మిగిలిన సొమ్ము ఇవ్వకపోవడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్. భాస్కర్ రెడ్డి విచారణ చేపట్టారు. భీమోలు అక్కదేవతల ఆలయం సమీపంలో ఉన్న అసైన్డ్ భూముల్లో ఉన్న అర్హుల జాబితాను పరిశీలించారు. 558/1ఎ భూమికి , ఫిర్యాదు దారుడు నరసింహారెడ్డికి ఆన్‌లైన్ చేసిన భూమికి సంబంధం లేదని గుర్తించారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని తెలిపారు.



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు

ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

బదిలీ అయిన ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఎ.షరీఫ్ డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలోని జిల్లా కార్యాలయంలో సోమవారం ముఖ్య కార్యకర్తలు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడారు. ఉపాధ్యాయుల బదిలీలు జరిగి ఇప్పటికీ రెండు నెలలు పూర్తి కావొస్తున్నాఉపాధ్యాయుల కేడర్ స్ట్రెంత్ సమస్య పరిష్కారం కాలేదన్నారు. దీని వల్ల ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించలేదన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించి ఉపాధ్యాయులకు రెండు నెలల జీతాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. గత పిఆర్‌సి బకాయిలతో పాటు 2024-25 సంవత్సరాల్లో ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఎలు, 2021 నుంచి పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ బకాయిలు, ఎపిజిఎల్ఐ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా కోశాధికారి ఇవిఎస్ఆర్.ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు స్వేచ్ఛగా బోధన చేసేలా అనువైన వాతావరణాన్ని కల్పించాలని ఉపాధ్యాయులను ఒత్తిడి గురి చేయడం సరికాదన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రూపస్ మాట్లాడుతూ ఈ యాప్‌ల నుంచి బోధ నేతర పనుల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలన్నారు. ఉపాధ్యాయులు ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణకు కట్టుబడి పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శులు కె.రమేష్‌బాబు, పి.శ్రీనివాస్‌మూర్తి, కె.నాగభూషణం, చిలుకూరి శ్రీనివాస్, కెవిఎస్.ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న అరుణకుమారి

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు

ప్రజాశక్తి- కొవ్వూరు

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలువుతుందని, ప్రతిపక్ష నేతలను అక్రమ అరెస్టుల ద్వారా భయభ్రాంతులకు గురి చేయాలని ప్రభుత్వం చూస్తుందని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తలారి వెంకట్రావు విమర్శించారు. ఎంపీ మిధున్ రెడ్డి అరెస్ట్‌కు నిరసనగా వైసిపి ఆధ్వర్యంలో కొవ్వూరు బస్టాండ్ సెంటర్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నిరసన వ్యక్తం చేశారు. ఎంపీ మిధున్ రెడ్డిని ప్రభుత్వం కుట్రపూరితంగా అరెస్ట్ చేసిందని ఆరోపించారు. మిధున్ రెడ్డి బయటకు వస్తారన్నారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, పట్టణం పార్టీ అధ్యక్షుడు చిత్తూరు అన్నవరం, వెంపాటి సురేష్, సుంకర సత్యనారాయణ ఉప్పులూరి సూరిబాబు, వైఎస్ఆర్‌సిపి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంటమణి రమేష్ మట్టా వెంకటరావు, పామెర్ల నగేష్,, చాగల్లు ఎంపిపి మట్టా వీరస్వామి, జుట్టా ఏడుకొండలు, కవల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

కార్టూ'నిజం'



ఉత్సాహంగా చెస్ పోటీలు

ప్రజాశక్తి -నిడదవోలు

స్థానిక రోటరీ ఆడిటోరియంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు ఆధ్వర్యంలో ప్రపంచ చదరంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం విద్యార్థులకు నిర్వహించిన చదరంగం పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నిడదవోలు పట్టణ సిఐ పివిజి.తిలక్ విచ్చేసి రిబ్బన్ కట్ చేసి పోటీలను ప్రారంభించారు. వివిధ పాఠశాలలకు చెందిన 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ఎంఇఒ గురుమూర్తి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. సీనియర్స్ బాయ్స్ విభాగంలో ప్రథమ బహుమతి పురుషోత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎంకెఎస్.శ్రీనివాస్, ద్వితీయ బహుమతిని తిమ్మరాజుపాలెం ఎకెఆర్‌జి హై స్కూల్ విద్యార్థి ఎస్‌కె.అమన్, సీనియర్స్ గర్ల్స్ విభాగంలో సమిశ్రగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్‌కె.సమీరా, ద్వితీయ బహుమతిని నిడదవోలు జిల్లా పరిషత్ బాలికొన్నత పాఠశాల విద్యార్థిజె.జెస్సిక, జూనియర్స్ బాయ్స్ విభాగంలో ప్రథమ బహుమతిని తిమ్మరాజుపాలెం ఎకెఆర్‌జి హై స్కూల్ విద్యార్థి ఎస్.రిషిధర్, ద్వితీయ బహుమతిని కోరుమామిడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నంబర్ వన్ విద్యార్థి బి.మోక్షిత్, జూనియర్స్ గర్ల్స్ విభాగంలో ప్రథమ బహుమతిని నిడదవోలు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థి ఎ.హన్సిక, ద్వితీయ బహుమతిని కోరుమామిడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నెంబర్ వన్ విద్యార్థి బి.నవనీత కైవసం చేసుకున్నారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు ప్రెసిడెంట్ మీసాల శివరామ హరిప్రసాద్, సెక్రటరీ దారపురెడ్డి శ్రీరామ ప్రతాప్, ట్రెజరర్ గుంటిపల్లి సత్యసాయి సీనియర్ రొటేరియన్స్ గోపిరెడ్డి శ్రీనివాస్, కొర్లేపర రత్నకుమార్, పోలదాసు శ్రీనివాస్, జి.రంగారావు, కేదారిశెట్టి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో ఎంఇఒ, నిర్వాహకులు



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

పిజిఆర్‌ఎస్‌కు 21 అర్జీలు

ప్రజాశక్తి - బిక్కవోలు

పిజిఆర్ఎస్ కార్యక్రమానికి 21 ఆర్జీలు అందాయని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన పిజిఆర్ఎస్ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఆర్జీలను తానే స్వయంగా స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలనే ఉద్దేశంతో తాను ఈ కార్యక్రమానికి హాజరయ్యారని తెలిపారు. ఆర్జీలను పరిశీలించి వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. 1100 నెంబర్‌కు కాల్ చేసి తమ పిజిఆర్ఎస్ ఫిర్యాదు స్థితిని తెలుసుకోవచ్చు తెలిపారు. లేదా వాట్సాప్ గవర్నెన్స్ నెంబర్ 9552300009 ద్వారా కూడా సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. పిజిఆర్ఎస్‌లో జిల్లా, డివిజన్, మండల, మున్సిపల్ స్థాయి అధికారులు హజరు అవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెసి చిన్న రాముడు, ఎంపిపి తేతల సుమ, ఎంపిడిఒ వి.శ్రీనివాస్, తహశీల్దార్ కృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల అందజేత

ప్రజాశక్తి - కొవ్వూరు

పట్టణంలోని టిడిపి కార్యాలయంలో సోమవారం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజురైన చెక్కులను ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు సోమవారం అదించారు. కాపవరం గ్రామానికి చెందిన సుంకర బుల్లి అచ్చాయమ్మ రూ.49,655, చౌటపల్లి మణి రూ.17,150, చౌటపల్లి రాంబాబు రూ.30,700, జోగి మేరీమాత రూ.42,840, ఆరికిరేవులకు చెందిన మారిశెట్టి వెంకటరమణకు రూ.45,350, వేములూరుకు చెందిన దండుబోయిన ప్రణయ్‌రిత్విక్ రూ.32,041, మద్దాల గంగరాజు రూ.56,851, రెల్లి సరోజినికి రూ.50వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. నియోజకవర్గ టిడిపి ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయుడుచౌదరి, మున్సిపల్ మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని, అర్బన్ బ్యాంక్ చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, టిడిపి పట్టణ అధ్యక్షుడు దాయన రామకృష్ణ, పెనుమాక జయరాజు, వేమగిరి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మంగళ సూత్రాలు చోరీ

ప్రజాశక్తి - మామిడికుదురు

అపరిచిత వ్యక్తి మంచినీళ్ల కోసం వచ్చి మహిళ మెడలో బంగారు మంగళ సూత్రాల బొందు అపహరించిన సంఘటన పాశర్లపూడి బాడవలో ఆదివారం రాత్రి జరిగింది. బైక్‌పై వచ్చిన అపరిచిత వ్యక్తి వలవల వరలక్ష్మిని మంచినీళ్లు అడిగి, తరువాత సెల్ ఫోన్ ఇవ్వండని అడగడంతో ఆమె నిరాకరించింది. దీంతో ఆమె గొంతు పట్టుకుని బెదిరించి రెండున్నర కాసుల మంగళ సూత్రాల బొందు తెంచుకొని బైక్‌పై వెళ్లిపోయినట్లు నగరం ఎస్ఐ చైతన్యకుమార్ సోమవారం తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

యువకుని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

గోదావరిలో స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు గోదావరిలో గల్లంతయిన యువకుడు మతదేహం ఎట్టకేలకు లభించింది. పోలీసుల తెలిపిన వివరాలు ప్రకారం..ఖమ్మం జిల్లా వేంసూరు మండలం లచ్చన్నగూడెం గ్రామానికి చెందిన పామర్తి సాయిదినేష్(22) సత్తుపల్లి వెస్ట్ మదర్ థెరిసా కాలేజీలో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. శనివారం తన స్నేహితులతో వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చి గౌతమి గోదావరి నదిలో స్నానం చేస్తుండగా మునిగి గల్లంతయ్యాడు. అప్పటి నుంచి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, ఎన్‌డిఆర్ఎఫ్ బలగాలు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే సోమవారం అయినవిల్లి మండలం చానపల్లి లంక సమీపంలోని గౌతమి గోదావరి నదిలో సాయి దినేష్ మృతదేహం లభించింది. మృతదేహాన్ని పడవపై ఒడ్డుకు చేర్చి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

బాలిక అదృశ్యం

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలం దారవరం గ్రామానికి చెందిన కొవ్వల దుర్గాభవాని(16) అదృశ్యమైందని తల్లి కొవ్వల ధనలక్ష్మి పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేసింది. దుర్గాభవాని చదువు మానేసి ఇంటి వద్దనే ఉంటుంది. ఈ నెల 17వ తేదీ రాత్రి నుంచి కనిపించట్లేదని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ కె.నరేంద్ర తెలిపారు.

గంజాయిని విక్రయిస్తున్న ఏడుగురు యువకుల అరెస్టు

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని జగనన్న కాలనీ ఇళ్ల వద్ద గంజాయిని అక్రమంగా కలిగి ఉన్నారనే సమాచారం మేరకు ఏడుగురు యువకులను అదుపులోకి తీసుకున్నామని, వారి నుంచి 5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకోకున్నామని సిఐ పివిజి.తిలక్ తెలిపారు. పట్టణ ఎస్ఐ కె.జగన్ మోహనరావు, సిబ్బంది వారిని పట్టుకున్నారని తెలిపారు. ఎవరైనా చట్ట వ్యతిరేకంగా నిషేధిత మత్తు పదార్థాలను కలిగి ఉన్నా, రవాణా చేసిన, అమ్మిన, సేవించిన వారిపై కేసులు నమోదు చేయబడతాయి అని సీఐ హెచ్చరించారు.

సారా బటీపై దాడి

ప్రజాశక్తి-గోపాలపురం

గోపాలపురం పెద్దగూడెం శివారులో మెట్టపై నాటు సారా తయారీ కేంద్రంపై దాడి చేసినట్లు ఎస్ఐ పి.మనోహర్ సోమవారం తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు స్థానిక గోపాలపురం పెద్దగూడెం శివారు మెట్టపై నాటుసారా తయారీ కేంద్రంపై దాడి చేశామన్నారు. 25 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామన్నారు. 8 డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన సుమారు 1600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. ఈమేరకు కేసు నమోదు చేశామన్నారు.



శేషారావు తో జిన్నా బాబు, తదితరులు

బూరుగుపల్లిని కలిసిన ఎఎంసి చైర్మన్ జిన్నాబాబు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

నిడదవోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన గాలింకి జిన్నాబాబు సోమవారం ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివద్ధి సంస్థ చైర్మన్ బూరుగుపల్లి శేషారావును వేలివెన్ను ఆయన స్వగహంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సంధర్భంగా జిన్నాబాబుకు శేషారావు అభినందనలు తెలిపారు. బాధ్యతాయుతంగా పదవిని నిర్వహించాలని, అలాగే పార్టీ పటిష్టతకు మరింత కృషి చేయాలని సూచించారు. పార్టీకి నిబద్ధతతో పని చేసే వారికి పదవులు వాటంతటవే వస్తాయన్నారు. టిడిపి మండల అధ్యక్షులు సింహాద్రి రామకృష్ణ, చివటం టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆయన వెంట ఉన్నారు. జిన్నాబాబు సన్నిహితులు, పార్టీ అభిమానులు, కార్యకర్తలు గత నాలుగు రోజులుగా పూల బొకేలతో శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

ఆర్ఎస్‌కె వద్ద సిమెంట్ బెంచీల ఏర్పాటు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంపై రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ ప్రోత్సాహంతో పలు రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉండ్రాజవరం రైతు సేవా కేంద్రం వద్ద రైతులు విశ్రాంతి తీసుకునేందుకు మూడు సిమెంట్ బెంచ్‌లను ఏర్పాటు చేసినట్లు బ్యాంకు సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పించారు.

'మానవత' ఆర్థిక సాయం

ప్రజాశక్తి- తాళ్లపూడి

భర్తను కోల్పోయి కుటుంబ ఖర్చులు, కుమార్త చదువు కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మండలంలోని సూరయ్య పేట గ్రామానికి చెందిన కడిమి సౌదామిని అనే మహిళకు మండల మానవతా శాఖ సోమవారం రూ.6వేల ఆర్థిక సాయాన్ని అందించింది. ఈ కార్యక్రమంలో మండల మానవతా శాఖ అధ్యక్షులు వి.శ్రీనివాస్, సభ్యులు ఎస్.రాజశేఖర్, పి.దుర్గాప్రసాద్, టిఆర్.మోహన్‌రావు, ఎస్.సుబ్బారావు, బి.శంకర్, ఎ.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌కు అధికారుల డుమ్మా..!

ప్రజాశక్తి - రాజానగరం

సమస్యలు తక్షణ పరిష్కారం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కారం వేదిక (పిజిఆర్ఎస్)కు అధికారులు నిర్లక్ష్యంగా ఉంటున్నారు. ప్రభుత్వం ఆదేశాలు లెక్క లేకపోవడం లేదా సమయం వృథా అనుకున్నారేమో కానీ రాజానగరం మండలంలో ప్రజా సమస్యల పరిష్కారం వేదికకు ఒక్క అధికారి కూడా హాజరు కాలేదు. మెక్కిబడిగా ఏడుగురు అధికారులు వచ్చినా రిజిస్టర్ లో సంతకాలు చేసి వెళ్లిపోయారు. రాష్ట్ర రాజధాని అమరావతి, జిల్లా కలెక్టర్ కార్యాలయం, మండల కార్యాలయాల్లో ప్రతి సోమవారం పిజిఆర్ఎస్ ఏర్పాటు చేసి ఉదయం 10 గంటలు నుండి మధ్యాహ్నం 1.గంట వరకు ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కావాలని ఆదేశాలు జారీ చేసింది. ఇవి రాష్ట్రమంతా అమలు జరిగినా రాజానగరం మండలంలో మాత్రం అమలు జరగట్లేదు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పిజిఆర్ఎస్‌కు తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్ మాత్రమే ఉన్నారు. ఐసిడిఎస్ శాఖ నుంచిముగ్గురు, పోలీసు శాఖ, ఎసిడిపిఒ శాఖ హాజరై రిజిస్టర్‌లో సంతకాలు చేసి వెళ్లిపోయారు. మండల కేంద్రంలో ప్రధాన కార్యాలయాలు, మండలంలో 34 సచివాలయాలు ఉన్నాయి. వీరిలో చాలా మంది రిజిస్టర్‌లో పిజిఆర్ఎస్‌కు వెళ్లినట్లు మాత్రం నమోదు చేస్తున్నారు. కాని హాజరు మాత్రం కావట్లేదు. ప్రజలు ఆయా కార్యాలయాలు వెలితే మాత్రం అధికారులు పిజిఆర్ఎస్‌కు వెళ్లారని కింద స్థాయి సిబ్బంది చెబుతున్నారు. అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.



తహశీల్దార్ కార్యాలయంలో అధికారులకు లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

కేటాయించిన ప్రదేశాల్లో వ్యాపారాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ పరిధిలో వ్యాపారాలు చేసుకుంటున్న చిరు వ్యాపారులు తమకు కేటాయించిన ప్రదేశాలలో మాత్రమే వ్యాపారాలు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చిరు వ్యాపారులు, మున్సిపల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో చిరు వ్యాపారులు తమ వ్యాపారాలు నిర్వహించుకునేందుకు గ్రీన్ జోన్, ఎంబర్ జోన్, రెడ్ జోన్‌లుగా ప్రదేశాలను గుర్తించామన్నారు. ట్రాఫిక్, ప్రజలకు, వ్యాపారులకు ఇటువంటి ఇబ్బందులూ లేకుండా జోన్‌ల ఎంపిక చేశామన్నారు. ఎవరికి ఏ ప్రదేశంలో స్థలం కేటాయించారో ఆ స్థలంలోనే వ్యాపారాలు చేసుకోవాలన్నారు. దీనిపై చిరు వ్యాపారుల సూచనలు, సలహాలు పరిగణలోకి తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఆయన వ్యాపారుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. మూడు రోజుల్లోగా మరో జోన్ గుర్తించి ప్రకటిస్తామన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ఫణికుమార్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.ఆదినారాయణ, పెద్దాపురం సిఐ జయశంకర్, మున్సిపల్ కౌన్సిలర్ యర్రా శ్రీను, మెప్మా సిఎంఎం భ్రమరాంబ, యూనియన్ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ సాయినాథ్, సిఒలు శ్రీదేవి, నర్గీస్, టిఎల్‌ఫ్ఒ బి.పూల భవాని, టిఎల్ఎఫ్ ఆర్‌పి సత్య వాణి పాల్గొన్నారు.

ఉపాధ్యాయునికి జాతీయ అవార్డు

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

మండలంలోని పాలగుమ్మి జడ్‌పి ఉన్నత పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయుడు నరసింహ చంద్రకుమార్ 'గ్రేట్ క్రియేటివ్ ఆర్టిస్ట్ అవార్డు'ను అందుకున్నారని క్రియేటివ్ హార్ట్స్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ సంస్థ అధినేత అంజి ఆకొండి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల తమ సంస్థ ఆధ్వర్యంలో 'సింధూర్ - సెల్యూట్ ఇండియన్ సోల్జర్స్' అనే అంశంపై జాతీయ స్థాయిలో నిర్వహించిన చిత్రకళా పోటీలలో 15 రాష్ట్రాలకు చెందిన 250 మంది చిత్రకారులు పాల్గొన్నారని తెలిపారు. ఈ పోటీల్లో పోలిశెట్టి నరసింహ చంద్రకుమార్ వింగ్ కమాండర్ వ్యోమికాసింగ్, కల్నల్ సోఫియా ఖురేషి చిత్రాన్ని వాటర్ కలర్స్ ఉపయోగించి వేశారని తెలిపారు. జాతీయ స్థాయి చిత్రకళా పోటీలలో అవార్డు వచ్చినందుకు పోలిశెట్టి నరసింహ చంద్రకుమార్‌ను పలువురు అభినందించారు.

మిథున్ రెడ్డి అరెస్టుపై వైసిపి శ్రేణుల నిరసన

ప్రజాశక్తి - అమలాపురం రూరల్, రామచంద్రపురం

ఎంపి మిథున్ రెడ్డి అరెస్టును ఖండిస్తూ సోమవారం రూరల్ మండలం జనుపల్లి గ్రామంలో వైసిపి విద్యార్థి విభాగం ఉభయగోదావరి జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ రమేష్ జిల్లెళ్ళ ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకుని మోకాళ్ళపై నిరసన వ్యక్తం చేశారు. ఎటువంటి ఆధారాలు లేని కేసులో మిథున్‌రెడ్డిని అరెస్టు చేయడం దారుణమని రమేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం నాయకులు పెయ్యాల సాయి, బడుగు మోహన్, వరసల సుజిత్, విన్సీ, సాగర్, ఆనంద్, రవికుమార్, సల్మాన్ రాజ్ పాల్గొన్నారు. ఎంపి మిథున్‌రెడ్డిపై తప్పుడు కేసులో ఇరికించి అరెస్టు చేయడాన్ని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పిల్లి సూర్యప్రకాష్ సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఎక్సైజ్ శాఖకు సంబంధం లేని వ్యక్తిపై తప్పుడు ఆరోపణలు, బలవంతపు ఒప్పందాలు, అధికార దుర్వినియోగం ద్వారా కేసులు పెట్టడం దారుణమన్నారు.

రూ.1.5 కోట్ల విలువైన భూమి స్వాధీనం

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం శ్రీకృత్తివెంటి పేర్రాజు పంతులు ఎడ్యుకేషనల్ ట్రస్టుకు చెందిన రూ.1.5 కోట్లు విలువైన 0.45 సెంట్లు స్థలాన్ని సోమవారం దేవదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా దేవదాయ శాఖ అధికారి వి.సత్యనారాయణ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ బాలాజీరామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో ట్రస్టు ఇఒ సత్యనారాయణ, ఆలయాల సిబ్బంది స్థలం స్వాధీనం చేసుకున్నారు. దేవదాయ శాఖ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు ఆక్రమణలో ఉన్న స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా దేవదాయ శాఖ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒలు జొన్నాడ.భీమశంకరం, వైవివి.సత్యనారాయణ, వి.బాలకృష్ణ, విత్తనాల.శ్రీనివాస్, ఆలయాల సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని కొత్తూరు మండల పరిషత్ పాఠశాలకు పారిశ్రామికవేత్త చింత నాగ సత్యనారాయణ మూర్తి కంప్యూటర్, ప్రింటర్‌ను బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు, పాఠశాల అవసరాలకు వినియోగించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంఇఒ బి.అప్పాజీ ప్రాథమిక దశ నుంచే విద్యార్థులకు కంప్యూటర్ విద్య ఆవశ్యకతను వివరించారు. దాతను, విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ కె.నాగరాజేశ్వరి, హెచ్ఎం వైవివి.రమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సినీ నటుడు గౌతమ్ రాజు సందడి

యు.కొత్తపల్లి : సినీ నటుడు గౌతమరాజు యు కొత్తపల్లి మండలంలో సోమవారం సందడి చేశారు. కొన్ని షార్ట్ ఫిలిం సన్నివేశాలు చిత్రీకరణ లొకేషన్ పరిశీలించేందుకు వచ్చినట్టు గౌతమ్ రాజుకు సన్నిహితుడైన వాకతిప్పకు చెందిన పేరూరి కల్కి తెలిపారు. గౌతమ్ రాజు రావడంతో పలువురు సెల్ఫీలు తీసుకునేందుకు పలువురు ఆసక్తి చూపారు

పంచాయతీల్లో ప్లానింగ్ విభాగంపై హర్షం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

గ్రామ పంచాయతీలు సుసంపన్నం కావాలనే సుదూర లక్ష్యంతో ఉప ముఖ్యమంత్రి పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీలలో ప్లానింగ్ విభాగం ఏర్పాటు చేయడం హర్షణీయమని మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్ పేర్కొన్నారు. రమణయ్యపేటలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నాలుగువేల మంది జనాభా లేదా రూ.50 లక్షలకు పైబడి వార్షికాదాయం కలిగిన పంచాయతీలలో భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేందుకు ప్లానింగ్ విభాగం ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన హర్షణీయమన్నారు. మేజర్ గ్రామ పంచాయతీలలో ప్లానింగ్ విభాగం లేకపోవడం వల్ల అస్తవ్యస్తంగా భవన నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. భవన నిర్మాణ అనుమతులన్నీ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు మంజూరు చేయడం వల్ల పంచాయతీలన్నీ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోవడంతో పాటు చాలా కాలయాపన జరుగుతోందన్నారు. వాస్తవంగా 73, 74వ రాజ్యాంగ సవరణ ప్రకారం 29 అంశాలను పంచాయతీరాజ్ వ్యవస్థకు బదిలీ చేయాల్సి ఉందన్నారు. అందులో భాగమే మేజర్ పంచాయతీలలో ప్లానింగ్ విభాగం ఏర్పాటు అన్నారు. మేజర్ గ్రామపంచాయతీలలో భవన నిర్మాణ అనుమతులను అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి తొలగించి పంచాయతీలలో ప్లానింగ్ విభాగం ద్వారా మంజూరు వల్ల అవి ఆర్థికంగా బలోపేతం అవడంతో పాటు మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం నిజమవుతుందని అడబాల తెలిపారు.

పోలీసుల వాహన తనిఖీలు

ప్రజాశక్తి - సామర్లకోట

హెల్మెట్, రేష్ డ్రైవింగ్‌పై సిఐ కృష్ణభగవాన్ సోమవారం విస్తత తనిఖీలు చేపట్టారు. వాహనదారులకు పోలీస్ యాప్ ద్వారా అపరాధ రుసుములు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్లు లేని డ్రైవింగ్, లైసెన్సు లేకుండా వాహనాలు నడపడం, అతివేగంగా వాహనాలు నడిపే వారిపై చర్యలకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సెంటర్‌లో బస్సు కోసం ఎదురు చూస్తున్న విద్యార్థినులను ఏమైనా సమస్యలు వున్నాయా అని అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలన

ప్రజాశక్తి - పెద్దాపురం

కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పరిపాలనపై ప్రజల్లో విస్తత ప్రచారం నిర్వహించాలని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబు అన్నారు. సోమవారం కాండ్రకోటలోని పద్మశ్రీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైసిపి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాల ద్వారా సహాయ సహకారాలు అందించామన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను కూడా అమలు చేయలేదన్నారు. వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, జెడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, ఎంపిపి పెంకే సత్యవతి, గ్రామ సర్పంచ్ మాకిరెడ్డి శ్రీనివాస్, ఎంపిటిసి వీరభద్రరావు, గవరసాన రాజశేఖర్, ఇనుకొండ వీర విష్ణు చక్రం పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యం సేవలు మరువలేనివి

ప్రజాశక్తి -కరప

వేళంగి మాజీ సర్పంచ్ డాక్టర్ బూసం సుబ్రహ్మణ్యం సేవలు మరువలేనివని గ్రాడ్యుయేట్ యూత్ నాయకులు అన్నారు. సోమవారం ఆయన జయంతి సందర్భంగా గ్రాడ్యుయేట్స్ యూత్ ఆధ్వర్యంలో వేళంగి పిహెచ్‌సి వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లరింపచారు. సానా శ్రీను, మేడిశెట్టి పట్టాభి, వాసంశెట్టి సుబ్బారావు, పురం ప్రసాద్, ముదుగు కృష్ణ, చాపల శివ, రాంబాబు, నరేష్, దూళ్ల వీరేంద్ర పాల్గొన్నారు.

ఉల్లాస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - అమలాపురం

సమాజంలో అందరికీ జీవితకాల అభ్యాస అవగాహన కోసం కేంద్ర ప్రాయోజిత అక్షరాస్యత ఉల్లాస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి అన్నారు. సోమవారం ఆమె పిజిఆర్ఎస్ కార్యక్రమంలో మాట్లాడారు. 15 సంవత్సరాలు అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న నిరక్షరాస్యులను లక్ష్యంగా ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం, ముఖ్యమైన జీవిత నైపుణ్యాలు, వృత్తి నైపుణ్యాల అభివృద్ధి, ప్రాథమిక విద్య వంటి కనీస సామర్థ్యాలను పెంపొందిస్తారన్నారు. పదిమంది నిరక్షరాస్యులకు ఒకరు చొప్పున వాలంటీర్లను నియమించి, అనుభవ ఆధారిత విద్యాభ్యాస కార్యక్రమాలను నిర్వహిస్తారన్నారు. ఉల్లాస్ పథకం సమాజంలోని ప్రతి ఒక్కరికి అర్హులైన వారికి కనీస విద్య నేర్చుకునే అవకాశాన్ని కల్పిస్తుందన్నారు. ఇంటర్ డ్రాప్ ఔట్ విద్యార్థులను జాయిన్ చేసి పరీక్షలు రాసి ఉత్తీర్ణులు అయ్యేలా చర్యలు తీసుకుంటారన్నారు. నిరక్షరాస్యులకు రోజూ రెండు గంటల చొప్పున మొత్తం 200 గంటల బోధన అందిస్తారన్నారు. క్లాసుల నిర్వహణకు పాఠశాలలు, ప్రభుత్వ కమ్యూ నిటీ భవనాలు, అంగన్‌వాడీ సెంటర్ల వంటి ప్రాంతాలను గుర్తించి, డిజిటల్ కంటెంట్తో బోధించేందుకు కంప్యూటర్, టివిలను సమకూరుస్తారన్నారు.



మాట్లాడుతున్న తహశీల్దార్ ప్రసాద్

సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

గ్రామ సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో నిర్వహించారు. గ్రామ సంఘ అధ్యక్షులు, సంఘ సహాయకులకు నిర్వహించిన ఈ శిక్షణా కార్యక్రమానికి తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమం ఉద్దేశ్యం, గ్రూపులు నిర్వహించాల్సిన కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. గ్రూపు సభ్యుల వ్యక్తిగత అవసరాలను గుర్తించి, వారికి అర్హత ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలైన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు, జాబు కార్డులు, ఇళ్ల నిర్మాణాలు, సామాజిక భద్రతా పింఛన్లు తదితర పథకాల్లో అర్హుల గుర్తింపు, గ్రామంలో నిస్సహాయకుల జాబితా తయారి వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఎంపిడిఒ వివివిఎస్.రామారావు గ్రామ స్థాయి ప్రణాళిక విధానంలో మహిళలను భాగస్వామ్యం చేయడం, స్వయం సహాయక సంఘాల ప్రణాళికలను తయారీ, స్వయం సహాయక సంఘాలు, పంచాయతీ రాజ్ సంస్థల మధ్య సమన్వయం, పేదరిక నిర్మూలన వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇఏపిఆర్‌డి ఆంజనేయశర్మ, ఎపిఎం టి.బాలకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం గ్రామంలో పలువురు బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) చెక్కులను జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు సంస్థ రాష్ట్ర కమిటీ కో-ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి సోమవారం పంపిణీ చేశారు. రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామకష్ణ సిఫారసు మేరకు వివిధ అనారోగ్య కారణాలతో చికిత్స పొంది సిఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈ చెక్కులు మంజూరయ్యాయి.

విద్యార్థులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు గ్రామంలో ఉన్న ఎస్‌విఆర్‌కె జూనియర్ కళాశాలలో సోమవారం ఉదయం ఎస్ఐ కె.నరేంద్ర విద్యార్థులకు అవగాహన కల్పించారు. శక్తి యాప్ పనితీరు, ఉపయోగాలు, మహిళా రక్షణ కోసం ఉన్న చట్టాలు, వాహన చట్టాలు, రహదారి భద్రతా నియమాలు వంటి వాటిపై అవగాహన కల్పించారు. అసాంఘిక కార్యకలాపాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పావని, మహిళా కానిస్టేబుల్ పాల్గొన్నారు



రోగులకు పండ్లు పంచుతున్న నాయకులు

రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ

ప్రజాశక్తి-గోకవరం

టిడిపి మండల అధ్యక్షులు మంగరౌతు రామకృష్ణ(రాము) పుట్టినరోజును పురస్కరించుకొని కూటమి నాయకులు రక్తదానం శిబిరం నిర్వహించారు. అనంతరం గోకవరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంచారు. రాము మాట్లాడుతూ తమ అభిమాన నాయకుడు ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగుతున్నాననారు. పుట్టినరోజు సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు రాయవరపు శ్రీనివాసరావు, వైద్యులు, పోసిన ప్రసాద్, మింది నరేంద్ర, సిద్ధ పవన్‌కుమార్, చీకట్ల రాజు, జనసేన నాయకులు కోటేష్, తేజ, పాల్గొన్నారు.

ఆదిత్య మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-గోకవరం

గోకవరంలోని ఆదిత్య మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బోన్ మినరల్ డెన్సిటి క్యాంప్‌లో ఎంఎస్ అర్థోపెటిక్ డాక్టర్ రవితేజ శ్వరరావు 258 మందికి వైద్య సేవలను అందించారు. బిఎండి(బోన్ మినరల్ డెన్సిటీ)టెస్ట్, యూరిక్ యాసిడ్ టెస్ట్‌లు ఉచితంగా నిర్వహించారు. అవసరమైన రోగులకు ముందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ యాజమాన్యం, వైద్యులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉద్యోగులకు సత్కారం

ప్రజాశక్తి - అల్లవరం

బదిలీపై వెళ్తున్న పలువురు సచివాలయ ఉద్యోగులను సర్పంచ్ బొమ్ము బాలవేణి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సోమవారం స్థానిక సచివాలయం 1, 2లలో విధులు నిర్వహిస్తూ బదిలీ అయిన ఉద్యోగులు ఎం.లోవరాజు బాబు, జె.అర్జున, డి.సువర్ణ, ఇ.గంగభవాని, కె.సురేష్, వై.రాజకుమారి, బి.యోగనాగేశ్వరి, షేక్ బేగంలను సత్క రించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దాసం రత్నశ్రీ, ఎంపిటిసి సభ్యులు నిచ్చెనకోళ్ల మౌనికవరలక్ష్మి, స్థానికులు కంకిపాటి వీరబాబు, మామిడిశెట్టి రాజు, సాయి, రాంబాబు, పంచాయతీ కార్యదర్శి ఎస్.రాజమోహన్ పాల్గొన్నారు.



పతకాలు సాధించిన పెద్దాపురం విద్యార్థులు

కరాటే పోటీల్లో పతకాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

విశాఖపట్నంలో 11వ రాష్ట్రస్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్-2025 పోటీల్లో పెద్దాపురం విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు, వెండి పతకాలు సాధించారు. సీనియర్స్ విభాగంలో తెప్పల యోగేష్ కరాటేలోని కాటాలో బంగారు పతకం , కుమిటీలో బంగారు పతకం సాధించాడు. బాలికల విభాగంలో యాసలపు సూర్య కళ కాటాలో బంగారు పతకం, కుమిటీలో బంగారు పతకం సాధించింది. జూనియర్స్ విభాగంలో పాసిల లోకేష్ కుమిటీలో బంగారు పతకం, కాటాలో రజత పతకం సాధించాడు. పతకాలు సాధించిన విద్యార్థులను పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు బుద్ధా శ్రీనివాస్, అధ్యక్ష కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్ కుమార్ అభినందించారు.

జంక్ ఫుడ్‌తో రోగాలు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

పోషక విలువలు లేని అధిక కేలరీలు గల అనారోగ్యకరమైన జంక్ ఫుడ్‌ను అధికంగా తీసుకుంటే అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జంక్ ఫుడ్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జంక్ ఫుడ్‌లో కొవ్వు అధికంగా ఉండటంతో పాటు చక్కెర మోతాదు కూడా ఎక్కువగా ఉంటుందన్నారు. వీటిలో ఖనిజాలు, విటమిన్లు, ప్రోటీన్లు, ఫైబర్ తక్కువగా ఉంటాయన్నారు. మిఠాయిలు, శీతల పానీయాలు, అధికంగా ప్రాసెస్ చేసిన ఆహారాలలో జంక్ ఫుడ్ ఉంటోందన్నారు. వీటిని అధికంగా తీసుకుంటే ఊబకాయం, మధుమేహం, జీర్ణ సమస్యలు, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక రోగాలు వేధించే అవకాశం ఉన్నందున వీటిని తీసుకోరాదని డాక్టర్ అడ్డాల తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, కుమార్ యాదవ్, బుద్ధరాజు సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురంలో హైటెక్ వ్యభిచారం

నిర్వాహకులకు పోలీసులు అండదండలు..?

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కాకినాడ జిల్లా పెద్దాపురంలో హైటెక్ వ్యభిచారం జరుగుతుందనే విమర్శలు ఇటీవల బాగా ఎక్కువగా వినిపిస్తున్నాయి. స్థానిక పోలీసులు, వ్యభిచార ముఠా నాయకులు కలిసి ఈ దందా కొనసాగిస్తున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. పెద్దాపురంలో దర్గా సెంటర్ కేంద్రంగా ఈ వ్యవహారం పెద్ద ఎత్తున నడుస్తుంది. పోలీసుల అండదండలతో వ్యభిచార గృహాల నిర్వాహకులు కలిసి కొన్నేళ్లుగా ఈ దందాను నడుపుతున్నారు. ఒక బాధితురాలి ఉదంతంతో ఈ హైటెక్ వ్యభిచారం వ్యవహారం బయటకు పొక్కింది.

ఉపాధి పేర వ్యభిచారం

ఉద్యోగాలు ఇప్పిస్తానని, ఉపాధి కల్పిస్తామని నమ్మబలుకుతూ కొందరు కీచకులు అమాయక మహిళలను టార్గెట్‌గా చేసుకుని వ్యభిచార కూపంలోకి లాగుతున్నారు. తన బిడ్డను దాచేసి బలవంతపు వ్యభిచారం చేయిస్తున్నారని సామర్లకోటకు చెందిన బాధిత మహిళ జిల్లా ఎస్‌పి, డిజిపి, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు ఫిర్యాదు చేయడంతో హైటెక్ వ్యభిచారం మరోసారి వెలుగులోకి వచ్చింది. స్థానిక పోలీసులు బిడ్డను అప్పగించినప్పటికీ తనకు న్యాయం జరగలేదని ఆ మహిళ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తోంది. తనను బెదిరింపులకు గురి చేస్తున్న భారతి అనే మహిళపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని ఆమె చెబుతున్నారు. భయపెట్టి, బెదిరించి, చిత్రహింసలు పెట్టి నాలుగేళ్లు బలవంతంగా వ్యభిచారం చేయించినందుకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీలు పెట్టుకున్నా స్పందించడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తోంది.

పెట్రోలు బంకులో పని చేస్తున్న తనకు పెద్దాపురం దర్గా సెంటర్ ప్రాంతానికి చెందిన గొల్లవిల్లి భారతి పరిచయమైందని, తన ఇంట్లో పనిమనిషిగా చేస్తే నెలకు రూ.15 వేలు జీతం ఇస్తానని చెప్పి పనిలో పెట్టుకుందని బాధితురాలు తెలిపింది. నెల తర్వాత వ్యభిచారం చేయమని బలవంతం చేసిందన్నారు. ఒప్పుకోకపోవడంతో కొంతమంది వ్యక్తులతో చిత్రహింసలకు గురి చేసి బలవంతంగా వ్యభిచారం చేయించిందని తెలిపింది. వ్యభిచారంలోకి దిగిన 5వ నెలలోనే తాను గర్భవతిని అయ్యాయని, 8వ నెల వచ్చినా సరే వ్యభిచారం చేయిస్తునే ఉందని ఆవేదన వెలిబుచ్చింది. ఆడ బిడ్డ పుట్టిన తరువాత భారతి తన బిడ్డను తీసుకెళ్లిపోయిందని తెలిపింది. ఖాళీ చెక్కులపై సంతకాలు చేయించుకుని వ్యభిచారం చేయకపోతే తన బిడ్డను చంపేస్తానని చెప్పి బయపెట్టేదని వాపోయింది. ఒక రోజు భారతికి జ్వరం రాగా ఆమెను హాస్పిటల్‌కు తీసుకొని వెళ్లిన సమయంలో తాను పోరిపోయి ఎస్‌పికి ఫిర్యాదు చేశానిని తెలిపింది. దీంతో తన కుమార్తెను రక్షించి అప్పగించారని, కానీ ఖాళీ చెక్కులు ఆధార్, పాన్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకాలు, ఇవ్వలేదన్నారు. వాటిని అడ్డుపెట్టుకుని తనను బెదిరిస్తున్నట్లు తెలిపింది. వారి నుంచి తనకు హాని ఉందని, తనకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటోంది. తనలాంటి వారు చాలా మంది ఈ కూపంలో ఇరుక్కుపోయారని తెలిపింది.వ్యభిచార గహం నిర్వాహకులు భారతికి కొందరు పోలీసులు పూర్తి స్థాయిలో సహకారం అందిస్తున్నారని తెలిపింది. దీనికి సంబంధించిన భారతితో కానిస్టేబుల్ దిగిన ఫొటోలను ఆమె చూపిస్తోంది.

విచారణ చేస్తున్నాం

పెద్దాపురంలో వ్యభిచారం ఘటనపై విచారణ చేస్తున్నామని రాష్ట్ర హోం మంత్రి అనిత సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. హైటెక్ వ్యభిచారం అంశంపై ఇప్పటికే జిల్లా ఎస్‌పి బిందు మాధవ్ తో మాట్లాడి వివరాలను తెలుసుకున్నానని, దీనిపై పూర్తిస్థాయి నివేదికను కోరామని ఆమె తెలిపారు. దీని వెనుక ఎవరున్నా వదిలే ప్రసక్తే లేదని, అసాంఘిక కార్యకలాపాలు, మహిళలను వేధించే ఘటనలను కూటమి ప్రభుత్వం సహించే ప్రసక్తే లేదన్నారు.